# పరిహారం

"మీ పేరు?"

"అదికూడా తెలుసుకోకుండా మా ఇంటికొచ్చారని నన్ను నమ్మమంటారా?" నేను సన్నగా నవ్వాను. కానీ తన ప్రశ్నకు సమాధానం కోసం ఆమె ఎదురుచూడలేదు. కొంగుతో నల్ల విరుగుడు చేవకుర్చీ తుడిచి నన్ను కూర్చోమన్నట్టు సంజ్ఞ చేసింది.

"మన్నించండి. వారు పోయిన తరవాత ఈ పది రోజులూ ఇల్లు శుభ్రం చేయలేదు. తీరికవేళ. మందారం! ఇన్‌స్పెక్టరుగారికి కాఫీ తెచ్చియ్యి." నేనెవరినో ఎలా కనిపెట్టారన్నట్టు చూశాను.

"మా దగ్గర దాపరికాలుండవండీ. మీరెవరో ఎందుకొచ్చారో నాకు తెలుసు. మాదంతా వంచన అనీ, మగవారిని వల్లో వేసుకోడం మాకు వెన్నతో పెట్టిన విద్య అనీ అంటుంటారు."

అది అబద్ధమని వివరించకుండానే తన పని తాను తిరిగి చేసుకోడం మొదలుపెట్టింది. ఒక అద్దాలబీరువా నిండా పుస్తకాలు దులిపి పేర్చుతోంది. మార్క్స్, ఎంజిల్స్, హెగెల్, చాణక్యనీతి, భారతం సంపుటాలు, హొవర్డ్ ఫాస్ట్ రచనలు, కృష్ణశాస్త్రి సంపుటాలు, గురజాడవారి డైరీలు, గీతగోవిందం, రకరకాలు వీటన్నిటినీ సమన్వయించే అభిరుచి ఎలాంటిదో నాకు అంతుపట్టలేదు.

"వారీ పుస్తకాలు చదివి అలాగే మంచం పక్కన పారేసేవారు. వారిని ఆస్పత్రిలో చేర్చాక ఇవన్నీ తీసి సర్దడానికి తీరిక చిక్కలేదు... వెంటనే ఇవన్నీ పంపించెయ్యమని కబురంపారు ఆవిడ- రావుగారి భార్యగారు. భార్య మరి. ఆవిడకు హక్కుంది."

నాగమణి నిట్టూర్చింది.

"అటువంటి మహారాజే పోయాక ఇవి నన్ను రక్షిస్తాయా? పంపేస్తాను."

"ఆయన ఆస్పత్రిలో ఉన్న ఇరవైరోజులూ మీరు రాత్రీ పగలూ అక్కడే ఉన్నారట?"

"తప్పలేదు. పాపం ఆవిడకి తీరికలేదు. ఆయన... పోతారని తెలుసు. ఎన్నో వ్యవహారాలు... అస్తవ్యస్తంగా చేసి పెట్టారాయన..."

అనుకోకుండానే నా పెదవులమీద చిరునవ్వు వచ్చినట్టుంది. ఆమె గుర్తించింది.

"నా భాష మీకు తెచ్చిపెట్టుకున్న భాషలా అనిపించొచ్చు. కాని తరతరాలుగా మాకు అలవాటైన భాష అది. ఇప్పుడిప్పుడు ఆ సంప్రదాయాలన్నీ పోతున్నాయి. కాని నేనా తోవలో పెరిగిన దాన్ని... మా అమ్మగారు ఉద్దండ పండితులతో సమంగా వాదించగలిగేది. అంత చదువు నాకు అబ్బకపోయినా, ఇంగువ కట్టిన గుడ్డకదండీ..."

పుస్తకాలు సర్దడం ఆపేసి, బీరువా పక్కనున్న ముక్కాలిపీట మీద కూర్చుంది. కళ్లలో అలసట, ఏదో పోగొట్టుకున్న దైన్యం.

"వారితో పరిచయం అయినప్పుడు నాకు ఇరవై అప్పుడే నిండాయి. ఎన్నికల ప్రచారానికొచ్చారు. రాత్రి పదకొండు. వాన. వారి కారు మా ఇంటికి పదిగజాల దూరంలో

ఆగిపోయింది. మెకానిక్ కోసం డ్రైవర్ని పంపారు. కిటికీలోంచి చూస్తున్నారు. అరగంటయినా అతను రాలేదు. అమ్మ గొడుగిచ్చి మా నౌకర్ని పంపింది, వారిని లోపలికొచ్చి కూర్చోమని. వారు కొంచెంసేపు సందేహించారు. లోపలికొచ్చారు. పడకకుర్చీ వేసింది అమ్మ. కూర్చున్నారు. 'మాబోటివాళ్ల ఇంటికి రావడానికి మీరు సంకోచించడం సహజం. అయితే నేను తమకన్న పదేళ్లు పెద్ద. మా అమ్మాయి ఇరవై ఏళ్లు చిన్న. ఇద్దరమూ ఈడూ జోడూ కాదు' అంది అమ్మ. వారు అమ్మవంక నావంకా చూశారు. అమ్మ మాటలకి నవ్వలేదు. కాని వారి కళ్లలో చమత్కారం తళుక్కుమంది. నేను గుర్తించాను. వారన్నారు. 'వోటు యాచించడానికి వచ్చినవాణ్ణి. మీకన్నా నేనే తక్కువ. నువ్వనుకొన్న సంకోచం కాదు, వోటుతోపాటు, ఆతిథ్యంకూడా అడగడం న్యాయం కాదని...' అమ్మ అంది. 'అంచేత మేం పిలిచేదాకా ఆగారన్న మాట.' వారు విశాలంగా నవ్వారు. అమ్మ కోడి కోయించింది. నేనే వండిపెట్టాను. రాత్రి మూడింటిదాకా అమ్మా ఆయనా గీత గోవిందాన్ని గురించి చర్చిస్తూంటే కూర్చుని విన్నాను. కారు బాగుపడి, ఆయన వెళ్ళిపోతూంటే నా మనస్సు చివుక్కుమంది. కాని ఆ తరవాత ఆరేళ్లకిగాని మా పరిచయం స్థిరపడలేదు. అప్పటికి ఆయన జిల్లా పరిషత్తు ప్రెసిడెంటయ్యారు."

నేలంతా నల్లని గచ్చుకాయ మెరుగు. ఎన్నాళ్లయినా చెరగని మెరుగు. వయసులో నిమిత్తంలేని మెరుగు. జోళ్లలోంచి కాళ్లుతీసి నేలమీద పెట్టాను. చల్లగా ఆప్యాయంగా నా పాదాల్ని నిమిరింది నేల. నాగమణి వంక చూశాను. ముప్ఫై ఉంటాయా? ఆ ఇంటి నేలలాగే వయసులో నిమిత్తం లేని చల్లదనం, ఆప్యాయత ఉన్నాయి ఆ మూర్తిలో. మగతనాన్ని లాలించి పోషించే స్త్రీత్వం. కాని ఆమె స్వీయచరిత్ర వింటూ కూర్చుంటే వచ్చినపని వెనకబడుతుంది.

"ఆఖరి రోజుల్లో ఆయన ఆర్థిక పరిస్థితి అంత బాగా లేదట?"

నావంక ఒక క్షణం చూసింది. చూపులో రవంత జాగ్రత్త. దాపరికం.

"ఆయన ఆర్థిక పరిస్థితి ఎప్పుడు బాగుంది గనక? న్యాయంగా దేశసేవ చెయ్యడానికి పూనుకున్నవారికి డబ్బు ఇబ్బందులు తప్పవు."

"ఆయన చేసినవి కొన్ని అంత న్యాయమైనవి కావేమో అన్న అనుమానం... అధికారులకు కలిగింది."

"అందుకే మీరు దర్యాప్తుకు వచ్చారు."

ఆమె లేచింది. పుస్తకాల బీరువాని అప్యాయంగా నిమురుతూ. ఆయన పరపతి ఎలాగైనా రక్షించాలన్నట్లు. ఆవేశంతో అంది.

"ఆయన ఏం చేసినా తనకోసం చేసుకోలేదు. ఆయనిచ్చిన అవకాశాన్ని కొందరు దుర్వినియోగం చేస్తే, ఆ తప్పు ఆయనది కాదు"

నా కళ్ళలోకి తీక్షణంగా చూస్తూ, నన్నే దుయ్యబడుతున్నట్టు అంది:

"ఆయన మీద దర్యాప్తు చెయ్యడానికి మిమ్మల్ని పంపారే, ఆ పెద్దల్ని గుండెమీద చెయ్యివేసుకుని చెప్పమనండి వారే తప్పు చెయ్యలేదా? ఒక్కొక్కరు లక్షలు చేసుకున్నారు. వాళ్లూ దగ్గర బంధువులూ ఆస్తులు సంపాదించుకున్నారు. ఉన్నదంతా పోగొట్టుకున్నవారు ఈయన. ఆ సంగతి వారి రాజకీయ మిత్రులకు బాగా తెలుసు"

"మిత్రులు" అన్న పదాన్ని "శత్రువులు" అన్నంత ఘాటుగా ఉచ్చరించింది.

"పల్లెటూళ్లో మీ ఇల్లూ, పొలం అమ్మేశారట?"

"కిందటిసారి అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి డబ్బు చాల్లేదు.. ఇల్లూ ఆస్తి రెండు లక్షలకి అమ్మేశారు... నిదానంగా అమ్మితే మూడు లక్షలైనా వచ్చేది. వ్యవధిలేదు. ఆయనకి చెప్పలేదు చెపితే అమ్మనిచ్చేవారుకారు.... ఇప్పుడీ ఇల్లు ఒకటే మిగిలింది..."

"ఆయన ఆస్తి?"

"చాలా భాగం హరించిపోయింది. స్వాధీనపు తనఖాల మీద అప్పులు. ఆయన్ని ఆశ్రయించుకున్నవారు లక్షాధికారు లయ్యారు. కిందటి ఎన్నికల్లో ఎవరూ కలిసిరాలేదు. - మొగం చాటేశారు. ఆయన పలుకుబడి తగ్గిపోయిందని వాళ్ల నమ్మకం....కానీ ఆయన నెగ్గడంతోటే, బెదిరిపోయారు. అందుకే ఎత్తుపై ఎత్తువేసి, ఆయన పదవిలోకి రాకుండా చెయ్యాలని మహా తంటాలు పడ్డారు. వాళ్ల ఆటలు సాగలేదు. మహరాజు - ఆయన..."

"ఆవిడ మాత్రం జాగ్రత్త పడ్డారట."

"తప్పేముంది? ఆవిడకూడా నాలాగ ఆస్తంతా ఆన్యాక్రాంతం చేస్తే, కొడుకు గతేం కావాలి?"

మందారం కాఫీ తెచ్చింది. చప్పరిస్తూ చూశాను. మందారానికి వయసులేదు. ఆడామగా కానిది ఏదో ఉంది ఆమెలో. కాగితపు గులాబిలాగ, వాసన ఉండదు. వాడిపోదు. కళ్లలో చిన్న సంజ్ఞ. నాగమణికళ్లు సందిగ్ధంతో ముడుచుకుపోయాయి. నావంక చూసింది. వెళ్లిపొమ్మని చెపుదామా వద్దా అన్నట్టు. ఏమీ అనకుండానే లోపలికి వెళ్లింది. పడకగది లోపలికి. తలుపు తెరిచి చటుక్కున మూసింది, నేను చూడకూడదన్నట్టు. కాని ఆ క్షణం వ్యవధిలో ఎదుట గోడకి తగిలించిన రావుగారి పెద్ద ఫోటో - దానికింద వెండి ప్రమిదలతో దీపాలు - అగరుధూపం కనపడ్డాయి.

"అబ్బాయి మీద అరస్టువారంటు వొచ్చింది - తెలుసా?"

ఆ గొంతు రావుగారి భార్యది...దొడ్డిదారిని వొచ్చి ఉంటుంది. పడక గదిలోకి. లేక మందారం, ఆవిడ కారులో రావడం చూసి ఆపి, నాకు కనబడకుండా, దొడ్డిదారిని లోపలికి తీసుకుపోయి వుంటుంది. అయిన ఇంటి ఇల్లాలు. భర్తపోయిన పదోరోజుని ఇల్లు వదిలినట్టు తెలిస్తే బాగుండదు. అయినా యిక్కడి కెందుకు వచ్చింది? ఇద్దరి మధ్యా ఏవిధమైన పొత్తులేదని విన్నాడు.

"పోలీసు లొచ్చి ఇల్లంతా సోదా చేశారు. సర్కారు సొమ్ముండాలట, రెండు లక్షలు. ఆయన సంతకం ఫోర్జరీచేసి ఎవరో తీసేశారట, ఆయన ఆస్పత్రిలో ఉండగా, అబ్బాయే తీశాడంటారు వాళ్లు...మీ ఇంట్లో పెట్టాడా?"

"మీరేనా అంటుంటా? నన్నేనా?" నాగుమణి.

"నువ్వెంతకయినా తగినదానివి. మా ఆయన్ని సొంతం చేసుకున్నావు - నా బిడ్డని నాకు దూరం చేశావు. నీకు నీతి నియమం ఉన్నాయా?"

"అన్యాయం మాటలాడకండి. నాకూ బిడ్డలాంటి వాడే అబ్బాయి."

"మొగాళ్లు వొట్టి పిచ్చిపీనుగులు గనక మీలాంటి వాళ్ల ఆటలు సాగుతున్నాయి."

"మీరే వాళ్లిద్దర్నీ దూరం చేసుకుని నన్నంటారేం? ఇంటికొచ్చింది మొదలు వేపించుకు తింటే ఏ మగాడయినా ఇంట్లో ఎలా ఉండగలడు? అబ్బాయినయినా ఒక్కరోజుని ఆప్యాయంగా పలకరించి ఎరుగుదురా?"

"నా కొడుక్కయినా బుద్ధి చెప్పుకోకపోతే వాడూ తండ్రిలాగే తయారయేవాడు."

"ఆయనలాగ తయారయితే ఎంతో సంతోషించి ఉందును. తండ్రి రాజకీయాలు – తల్లి సాధింపులు. డబ్బుకోసం రచ్చలు. తల దిమ్మెక్కిపోయి కాస్త ఆప్యాయతయినా దొరుకుతుందని ఇక్కడి కొచ్చేవాడు.. మోసంచేసి, ఆయనచేత సంతకం పెట్టించుకున్నారు పవర్‌పట్టా మీద. అందులో జబ్బుగా ఉన్న మనిషిచేత – ఆస్పత్రి ఖర్చుకి కూడా డబ్బు అందనివ్వలేదు..."

"ఎంతయిందో చెప్పు. అణా పైసలతో పారేస్తాను."

"డబ్బుమీద ఆ మాత్రం జాగ్రత్తే నాకుంటే...మూడు లక్షల ఆస్తి ఆయన కోసం అమ్మేస్తానా?"

"ఉద్ధరించావు. నువ్వు డబ్బు ఇవ్వకపోతే ఆయన ఎలక్షన్లో నిలబడేవారు కాదు. మేమిట్లా వీధిన పడాల్సిన అగత్యం ఉండేది కాదు. నేను డబ్బివ్వనిది ఆయనమీద ఇష్టంకొద్దీ. రాజకీయాల్లో పడి ఇల్లంతా గుల్లచేస్తున్నారని. పదవులు శాశ్వతం కాదని నాకు తెలుసు. పోయిన తర్వాత అదుక్కు తినాలి – ఆయనా నేనూ అబ్బాయీ. ఆస్తి అమ్మనివ్వక పోడానికి అదీ కారణం."

"ఆయనకి రాజకీయాలే ప్రాణం. దూరం చేస్తే ఆయనకి బతికుండగానే చావు. ఆడదానికి ఇల్లూ మొగాడే సర్వస్వం. మొగాడికి ఇల్లూ, ఇల్లాలూ చాలవు. లోకం, పేరు, ప్రతిష్ఠ, ఆశయాలు – ఎన్నో ఉంటాయి. అయితే ఇల్లూ కావాలి. ఆడదాని ఆప్యాయత కావాలి."

"నువ్వు సప్లయి చేశావుగా... నా బతుకు ఎందుకూ కాకుండా అయిపోయింది. ..నేనెవరికీ కాకుండా అయిపోయాను... కన్నబిడ్డకి నన్ను చూస్తే తిక్క... ఎన్నైనా చెపుతావు..నీకేం?... శ్రీరంగ నీతులు... నాకు మిగిలిందల్లా వాడొక్కడు. పోలీసులు పట్టుకుంటారు. జైల్లో పెడతారు..." ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. "అతను ఫోర్జరీ చేశాడని రుజువేమిటి?... నే చెపుతాను... ఆయనే సంతకం.." అప్పుడు గుర్తుకొచ్చినట్టుంది, నేను హాల్లో ఉన్నట్టు. కంగారుగా తలుపు తెరిచింది. అప్పుడు చూసింది రావుగారి భార్య నన్ను.

"నువ్వా? ఇక్కడికి కూడా..." వెంటనే అయినింటి ఇల్లాలు నని గుర్తుకొచ్చినట్టుంది. చర్రున దొడ్డిదారిని వెళ్లిపోయింది – పారిపోయినట్లు వెళ్లిపోయింది. నాగమణి హాల్లో కొచ్చింది. ఆ కొద్దిక్షణాల్లో ఎంతో వయసు పైబడ్డట్టు కనిపించింది. జీవం లేనట్టు చతికిలపడింది, ముక్కాలి పీటమీద. గదిలో గోడని పటంలో రావుగారి ముఖంలో చిత్రమైన చిరునవ్వు. దీపాలు ఆనందంగా వెలుగుతున్నాయి కింద.

"మూడేళ్లయింది. ఆవిడ ఈ ఇంటికొచ్చి. మళ్ళీ ఇప్పుడొచ్చింది, తప్పనిసరి అయి. పాపం అమాయకురాలు – ఆడది..."

చటుక్కుని ఆమె ముఖంలో గాంభీర్యం, తీవ్రత, గొంతులో ఆవేశం.

"అటు చూసి చెప్పండి. ఆ మహరాజు సొంతానికి ఏమన్నా ఎప్పుడన్నా చేసుకున్నాడా? ఆయన పేరు రచ్చకెక్కిస్తే మీకేం ఒలుకుతుంది? ఇంక మనిషి మీద నమ్మకం ఉంటుందా ఈ లోకంలో..?"

నేనేం సమాధానం చెపుతాను? దీర్ఘంగా నిట్టూర్పు వదిలింది.

"నేనే ఆయన సంతకం పెట్టాను. మీరేం చేసినా సిద్ధంగా ఉన్నాను." అంది. నాకు మతిపోయింది. ఆమె చెయ్యలేదని నాకు తెలుసు.

"రాసి ఇమ్మంటారా?"

"వొద్దు...ప్రభుత్వం సొమ్ము పోతే దర్యాప్తు చెయ్యడం మా విధి. వీలుగా దొరికిన వారిమీద నేరం మోపి శిక్షించడంకాదు..."

"నేరం ఒకరిమీద రుజువయితే అనవసరంగా ఇంకొకరిమీద పడదుగా."

"అందుకని చెయ్యని నేరం మీ మీద మోపుకుంటారా?" ఒక క్షణంపాటు నేను పోలీసు ఉద్యోగినన్న సంగతి మరిచిపోయాను – ఆమె గదిలోవున్న రావుగారి ఫోటోవంక చూసింది. ఆ చూపుల్లో ఎంతో తృప్తి, తహతహ, ఆవేదన, ఆనందం ఉన్నాయి.

"ఆయన దగ్గరనుంచి నేను పొందినదానికి విలువలేదు. ఆయన కోసం నేను ఏ పరిహారమైనా చెల్లిస్తాను..."

చివరికి ఆమె చెల్లించిన పరిహారం, ఇల్లు తాకట్టుపెట్టి రెండు లక్షలు ప్రభుత్వానికి కట్టి, రావుగారి కొడుకుమీద కేసు రద్దు చేయించింది.

●